

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న అడిషనల్ డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - ఆలమూరు

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వస్థ భారత్ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వస్థ అవార్డు సాధనకు కృషి చేయాలని కొత్తపేట అడిషనల్ డిఎంహెచ్ఒ ఎం.సుమలత అన్నారు. పెదపళ్ల పిహెచ్‌సిని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య, ఆరోగ్య సేవలు అందిస్తున్న తీరును స్థానిక రోగులను అడిగి తెలుసు కున్నారు. రికార్డులను పరిశీలించి వైద్యాధికారులు డి.సాయికిశోర్, కె.భాగ్యశ్రీకి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎంఎస్ఎన్ రెడ్డి, హెచ్ఇఒ ఎవివి.రాజా, సూపర్‌వైజర్ ఎం.ముద్రగడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమాకు గ్రహణం

- 15 నెలలుగా అందని బీమా
- బీమా కోసం లబ్ధిదారుల ఎదురు చూపులు.

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు మండలం శివకోటి గ్రామానికి చెందిన కోన ప్రవంతి తన భర్త చనిపోయి ఏడాది పూర్తి అవుతోంది. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. 6 నెలల పాటు పంచాయతీ చుట్టూ తిరిగిన ప్రయోజనం లేదు. బీమా డబ్బులు కోసం ఎదురు చూస్తోంది. ఇది కేవలం ఒక ప్రవంతి కి సంబంధించిన విషయం కాదు జిల్లాలో చాలా మంది భర్త చనిపోయి, తండ్రి పోయి బీమా కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ముందు బీరాలు పలికిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకా లను అటకెక్కిస్తున్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ఆర్ బీమా పేరుతో ఈ పథకం ఎంతో మంది పేదలకు మేలు జరిగింది. అయితే టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నికల సభల్లో గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ చంద్రన్న బీమాను మళ్లీ అమలు చేస్తామని, రూ.5 లక్షల ఉన్న పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచి అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిదాటినా ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. అయితే వారిని కోల్పోయి ఆధారం లేక బీమా కోసం ఎదురు చూస్తున్న బాధితు లకు కూడా మొండి చేయి చూపించారు. పరిహారం పెంచడం మాట అటుంచితే గతంలో ఉన్నది ఇవ్వకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ప్రమాద లేక సాధారణ మృతులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సాయం (బీమా) అమలు కాకపోవడంతో ఆయా కుటుంబాల వారు తీవ్ర అవస్థలు పడు తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం వైఎస్ఆర్ బీమా పేరుతో అమలు కాగా ప్రస్తుత ప్రభుత్వం దానిని చంద్రన్న బీమాగా మార్పు చేసింది. సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు ధీమానిచ్చే చంద్రన్న బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడరాదనే ఉద్దేశంతో గత వైసిపి ప్రభుత్వం రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా అమలు చేసింది. రూపాయి ఖర్చు లేకుండా బీమా పరిహారం అందించి పేద కుటుంబాలకు భరోసా ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే వైఎస్ఆర్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా పేరు మార్చడం తప్ప కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే భరోసానివ్వడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఏడాది పైబడిన, ఒక్క కుటుంబానికి కూడా బీమా పరిహారం అందలేదు. ఈ పథకం గతంలో బాధితులకు అండగా ఉండేది. ప్రభుత్వం వెలుగు కార్యాలయాల ద్వారా బీమా మిత్రలను ఏర్పాటుచేసి తక్షణ సాయం కోసం సమాచారం అందగానే బీమా మిత్రలు వెంటనే సంబంధిత కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న నగదును అందిస్తారు. అలాగే నెలలోపు మిగిలిన నగదు నామినీ బ్యాంకు ఖాతాలో జమ అయ్యేది. ఈ క్రమంలో మృతి చెందిన కుటుంబీకుల సర్టిఫికెట్లు తీసు కుని సామాన్య ప్రజలు సచివాలయాలు మండల కార్యాలయాలు చుట్టూ కాళ్ళ అరిగేలా తిరుగుతున్నారు. చాలామంది అర్హులకు కనీస రిజిస్ట్రేషన్లు కూడా జరపకుండా కొంతమేరకు మాత్రమే రికార్డుల్లో చూపడం గమ నార్హం. ఈక్రమంలో పథకం ప్రజలకు అవసరం తీర్చేందుకు లేక తప్ప లు పెట్టేయటం అర్థరకం పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.



పేరుపై ఉన్న శ్రద్ధ.. అమలులో లేదు..!

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 5.39 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉండగా సుమారు 4.5 లక్షల కుటుంబాలు చంద్రన్న బీమా కింద నమోదై ఉన్నాయి. చంద్రన్న బీమా పథకానికి పట్టిన గ్రహణం ఎప్పుడు వీడుతుందా, తమ కుటుంబాల్లో వెలుగులు ఎప్పుడు చోటు చేసుకుంటాయా అని వందలాది కుటుంబాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి. 2024 మార్చి నెల 18 నుంచి ఎన్నికల కోడ్ రావడంతో అప్పటి నుంచి బీమా కింద రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్లు అప్లోడ్ చేయ డం ఆగిపోయింది. గత ఏడాది జూన్ 12న నారా చంద్రబాబు నేతృ త్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. వెంటనే వైఎస్ఆర్ బీమాను చంద్రన్న బీమాగా పేరు మార్చినప్పటికీ పథకం అమలులో వేగం లేకపోవడం గమనార్హం.. దీంతో బాధిత కుటుంబాలు బీమా ఎప్పుడు వస్తుందోనన్న ఆశతో ఎదురుచూస్తున్నాయి. ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీ అమలుపై ఇంతవరకు విధి విధానాలు రాలేదు. ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు, సహజ మరణాలకు రూ.5లక్షలు పరి హారం వర్తింపజేసేలా ఉత్తర్వులు కూడా ఇవ్వలేదు. దీనిని బట్టి చూస్తే కుటుంబాలకు ఆధారమైన వారు మరణిస్తే వారికి ధీమా కల్పించడం సాధ్యం అయ్యేలా కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

బీమా ఎప్పుడో? హామీ నెరవేరేదెప్పుడో..!

ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి జూన్ నెల వరకు 87 మంది ప్రమాదవశాత్తూ మరణించినట్లు రిజిస్టర్ అయింది. ప్రమాదమరణాలకు సంబంధించి చాలావరకు డాక్యుమెంట్లు అప్లోడ్ అయ్యాయి. 233 మంది సహజంగా మరణించగా డాక్యుమెంటేషన్ జరుగుతోంది. మొత్తంగా 320 కుటుంబాలు చంద్రన్న బీమా కోసం ఎదురు చూస్తున్నాయి. 2024 జులై నుంచి చంద్రన్న బీమా గా వెబ్‌సైట్ నిలిచిపోవడంతో సాధారణ, ప్రమాదవశాత్తు మతి చెందిన మరణాల కుటుంబ సభ్యులు ఆయా పంచాయితీల చుట్టూ తిరుగుతూ బీమా కోసం ఎదురుచూస్తున్నారు.బీ మా పొందినవారు ఏ విధంగా మరణించినా 24 గంటల్లో మట్టి ఖర్చు కోసం రూ.10వేలు చెల్లిస్తారు. కుటుంబ యజమాని మరణించినా మట్టి ఖర్చులు కూడా దక్కడం లేదు. ఎన్నికల సమయంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయ కులు తాము అధికారంలోకి రాగానే ప్రమాదవశాత్తూ జరిగే మరణాలకు రూ.10 లక్షలు, సహజ మరణాలకు రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పైబడినా హామీ అమలుపై దృష్టి సారించలేదు. చంద్రన్న బీమాకు పట్టిన గ్రహణం ఎప్పుడు వీడుతుందా అని బాధిత కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.

బాధిత కుటుంబాలనిరీక్షణ!

నెలల తరబడి క్లెయిములు పరిష్కారం కాకపోవడంతో బాధిత కుటుంబాలు నిరీక్షణ తప్పడం లేదు. వాస్తవానికి 30 రోజుల్లోపే బీమా పరిహారం సొమ్ము బాధిత కుటుంబాలకు అందాల్సి ఉంది. ఇంటి పెద్దను, ఆసరా అందించే వారిని కోల్పోయి కుటుంబాలు పోషణ కష్టంగా మారిన పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న బీమా సొమ్ము వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. కాని కూటమి ప్రభుత్వం బాధితుల ఆర్తనాదాలు వినకుండా హామీని తుంగలో తొక్కి అంత చేస్తున్నారు.. బీమా అమలు కోసం ప్రచారాలు మాత్రం చేసుకుంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వర్తింపు ఇలా...

గతంలో టిడిపి హయాంలో తెల్ల రేషన్ కార్డు ఉండి కుటుంబంలో 18 ఏళ్ల నిండి ఎంత మంది ఉన్నా బీమా వర్తించేది. 50 నుంచి 60 ఏళ్ల లోపు వారు సహజ మరణం పొందితే రూ.2 లక్షలు, 50 ఏళ్ల దాటితే రూ.30 వేలు ఇచ్చేవారు. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షలు దక్కేది. 14 రోజుల్లోనే క్లెయిమ్లు పరిష్కరించేవారు. ఈ సారి బిపిఎల్ కుటుంబాల్లో 18 నుంచి 70 ఏళ్ల వారికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు, సాధారణ మరణమైతే రూ.2 లక్షలు ఇచ్చేందుకు ఆలోచన చేస్తోంది.


నిర్ణయం తీసుకోవాలి..

గత ఏడాది జూన్ నుంచి వైఎస్ఆర్ బీమా పథకం రద్దయింది. కొత్తగా చంద్రన్న బీమా పథకంపై ఇంకా పూర్తి స్థాయిలో గైడ్లెన్స్ రావాలి చంద్రన్న బీమా పథకం అమల్లోకి వస్తుందో లేదో తెలియని పరిస్థితి .ప్రస్తుతానికి మృతుల వివరాలు సేకరిస్తున్నాం. పెండింగ్లో ఉన్న క్లెయిమ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం దీనిపై ఎలాంటి నవీకరణ లేదు.

- టి.జయచంద్ర,, డిఆర్‌డిఎ పీడీ,అంబెద్కర్ కోనసీమ జిల్లా

ఫైనాన్స్, బ్యాంకుల వేధింపులను అరికట్టాలి

కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు, తులసిరావు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో ప్రయివేటు ఫైనాన్స్‌లు, ప్రయివేటు బ్యాంకులు వేధింపుల రోజురోజుకీ పెరుగుతున్నాయని వీటిని అరికట్టాలని కుల వక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసి రావు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడు తూ ఇటీవల కాలంలో అల్లవరం మండలం తాడికొన గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై ప్రయివేటు బ్యాంకులో వేధింపులు చేస్తున్నాయని మా దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి కలెక్టర్‌కి వినతిపత్రం అందించామని అన్నారు. ఈ సందర్భంగా ఫైనాన్సు వేధింపులను, ప్రయివేటు బ్యాంకు వేధింపులను అరికట్టాలని కలెక్టర్‌ని కోరామన్నారు. అయినప్పటికీ నేటికీ ప్రయివేటు బ్యాంకులు, బైక్ ఫైనాన్స్ కంపెనీల వేధింపులు కొనసాగుతున్నాయని వారు వాపోయారు. నేడు అల్లవరం మండలం చెందినటువంటి ఒక దళిత యువకుడిని అమలాపురం మహిపాల వీధిలో గల శ్రీలక్ష్మి నరసింహ ఫైనాన్స్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రోజువారీ వడ్డీలు పేరుతో అధిక వడ్డీలు వసూలు చేస్తూ వేధిస్తున్నారని అన్నారు. అంతే కాకుండా ఫైనాన్స్ అగ్రిమెంట్ చేయించుకొన్న కాల పరిమితికి ఏడు నెలలు ముందుగానే రుణాన్ని తిరిగి చెల్లించి నప్పటికీ కూడా ఇంకా అధికంగా డబ్బులు కట్టాలని బెదిరిస్తూ వేధిస్తున్నారని వారు తెలిపారు. డబ్బులు తగ్గించాలని మాకు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఆ శ్రీ లక్ష్మీ ఫైనాన్స్ వారిని దళిత యువకుడు వేడుకొన్నాడన్నారు. శ్రీ లక్ష్మీ ఫైనాన్స్ వేధింపులపై ఆ దళిత యువకుడు కెవిపిఎస్ ముందు వాపోయాడని అన్నారు. వేధింపులపై యువకుడు కెవిపిఎస్‌ను ఆశ్రయించాడని ఈ సందర్భంగా వారు తెలిపారు. సంబంధిత శ్రీ లక్ష్మీ నరసింహ ఫైనాన్స్ యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే శనివారం అమలాపురం టౌన్ పోలీస స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు ఈ సందర్భంగా తెలిపారు. తక్షణం పోలీసులు శ్రీ లక్ష్మీ ఫైనాన్స్ యాజమాన్యంపై ఎస్‌సి అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితుడికి న్యాయం చేయాలని వారు కోరారు.

సుంకాల పెంపు ఉపసంహరణకు డిమాండ్



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

భారతీయ సరుకుల దిగుమతులపై అగ్ర రాజ్యం విధించిన 50 శాతం సుంకాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల శాఖ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నగర పంచాయతీ పరిధిలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం మండల కార్యదర్శి సఖిలే సూర్య నారాయణ ఆధ్వర్యంలో శనివారం అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టారు.ఈ ధర్నా నుద్దేశించి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం భారతీయ ఉత్పత్తులపై ప్రభావం చూపుతాయన్నారు. ముఖ్యంగా రైతులు పండించే పంటలతో పాటు,ఆక్వా, టెక్స్టైల్, గార్మెంట్స్ రంగాల ఉత్పత్తుల ధరలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ట్రంప్ నిర్ణయాలపై కేంద్రం లోని ప్రధాని మోడీగాని, రాష్ట్రంలోని సిఎం చంద్రబాబు గాని నోరు మెదపకపోవడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. తక్షణమే అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల్ని పన్నులు లేకుండా దిగుమతి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ సుభాష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాము బాలయ్య, విత్తనాల రాంబాబు, విత్తనాల ఏడుకొండలు, ముంగండ దుర్గ బాబు, కె.లక్ష్మణరావు, పి.బాలయోగి లతో పాటు పలువురు పాల్గొన్నారు.



అందజేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వచ్ఛంద సేవా సంస్థల ఆర్థిక సహాయంతో ప్రతిభ పురస్కారాలు అందించారు. శనివారం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో సాపే వారిపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ.సుధ అధ్యక్షతన కమిడి నీలయ్య ఫౌండేషన్ ఆర్థిక సాయంతో 2024-25 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ప్రథమ స్థానం సాధించిన యాళ్ళ దుర్గా అక్షయకి రూ.15వేలు, ద్వితీయ స్థానం సాధించిన తిరుమాని సత్యవేణి కి రూ.10వేలు, తృతీయ స్థానం సాధించిన వైధాని ఐశ్వర్యకి రూ.5వేలు అందజేశారు. స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కమిడి శాంతనుడు మాట్లాడుతూ కమిడి నీలయ్య జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మరొక స్వచ్ఛంద సేవ సంస్థ జంగా పురుషోత్తం విద్యార్థిని, విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3000, రూ.2000, రూ.1000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ కాశి శ్రీనుబాబు, ఫౌండేషన్ సెక్రటరీ కెఎంవి.ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఎన్ఎస్.సత్యనారాయణ, ఇళ్ల గణేష్, ఎం. శ్రీనివాసరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

15 నుంచి యుటిఎఫ్ రణభేరి



రణభేరి జాత పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - అమలాపురం

పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు జరిగే యుటిఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేంద్రకుమార్, ఎంటివి ఎఎస్.సుబ్బారావు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా అమలాపురం యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నందు రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిన ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని, ఉపాధ్యాయులపై యాప్‌ల పని భారం, పి4, విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్ష మూల్యాంకనం, ఆన్లైన్ అప్లోడ్, గ్రీన్ పాస్పోర్ట్ మొదలైన బోధనేతర పనులు పనిభారం విపరీతంగా ఉపాధ్యాయులపై మోపుతున్నారని అన్నారు. తద్వారా విద్యాబోధనకు ఆటంకంగా ఉందని తెలియజేశారు. పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని, డిఎలు విడుదల చేయాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలో సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు యుటిఎఫ్ రణభేరి జాత జరుగుతుందని, తదుపరి సెప్టెంబర్ 25న రాష్ట్రంలో బహిరంగ సభ ద్వారా యుటిఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలన్నింటిలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని డిమాండ్



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ వర్కర్ల వేతనాలు పెంచాలని ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్ల మహాసభ శనివారం రామచంద్రపురం చెలికాని రామా రావు భవనంలో నిర్వహించారు. ఉప్పులూరి వీరలక్ష్మి అధ్యక్షత వహించగా మేడిశెట్టి దుర్గమ్మ, నూకల బలరామ్, కె.కృష్ణవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీలు 42 రోజుల సమ్మె చేసి అంచలగా తమ డిమాండ్స్ సాధించుకుంటున్నారని అన్నారు. యాప్‌లతో చాలా ఇబ్బంది పడు తున్నారని వాటిని రద్దు చేయాలని అన్నారు. అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను ఇవ్వాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని కోరారు. అనంతరంనూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు నూకల బలరామ్, అధ్యక్షులుగా ఉప్పులూరి వీరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, వర్కింగ్ అధ్యక్షులు వాసంశెట్టి సూర్య కుమారి, ఉపాధ్యక్షులుగా జహర, చంద్రకళ, కార్యదర్శులుగా వెంకటరత్నం, సుధా, కోశాధికారిగా కె.దుర్గ, కమిటీ సభ్యులుగా లక్ష్మీరత్నం, కనకదుర్గ, కుంతీ దేవి ఎన్నికయ్యారు.



పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

సిసి రోడ్ల నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలో 27, 28 వార్డులలో మున్సిపల్ నిధులు రూ.36 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను శనివారం రాష్ట్ర అంచనాల కమిటి ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతలోపం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో లంకలపల్లి రాం బాబు, ఎండి. కరీం, అల్లూరి రామకృష్ణ చౌదరి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

ఇటీవల ప్రయివేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకుని ఆర్థిక సాయం కొరకు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 28 మందికి రూ.18,55,213 మంజూరైంది. ఈ చెక్కులను శనివారం మండపేట టిడిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు చేతులమీదిగా బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, కుటుం బ సభ్యులు తదితరులు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, ఎంపిడిఒ తదితరులు

ప్రజాశక్తి- మామిడికుదురు

ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని ఎంపిపి కుసుమ వనజకుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు లూటుకుర్రు పంట కాలు వపై నిర్మించిన డ్యామ్ కు షట్టర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటు న్నారని జడ్‌పిటిసి కసిరెడ్డి అంజిబాబు సభ దృష్టికి తీసుకువచ్చారు మామిడికుదురు, లూటుకుర్రు గ్రామాలలో పంట కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ పైపులైన్లు సరిచేయాలని ఎంపిటిసి నామన వెంకటేశ్వరరావు విన్నవించారు. దీనిపై తక్షణమే స్పందించాలని కోరారు మండలంలో యూరియా సమస్య లేదని రెండు రోజుల్లో మూడవ విడత యూరియా అందుబాటులోకి వస్తుందని వ్యవసాయాధికారి సత్య నారాయణ తెలిపారు. పెదపట్నంకు బస్సు సర్వీస్ నడపాలని సర్పంచ్ గుబ్బల దుర్గ అధికారులకు విన్నవించారు. సమావేశంలో ఎంపిడిఒ భవాని, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన



హెచ్‌ఎం మాణిక్యాలరావును అభినందిస్తున్న ఎంపిడిఒ


ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గూడపాటి మాణిక్యాలరావును శనివారం ఎంపిడిఒ బికెఎ స్ఎస్.వెంకట్‌రామన్ అభినందించారు. మాణిక్యాల రావు మండలంలోని మెర్లపాలెం శివారు వాసంశెట్టి వారి పాలెం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్నారు. **అమలాపురంరూరల్:** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఇందుపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లంకరాణిని గ్రామస్తులు శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాలిని అప్పాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఇందుపల్లిలో అవార్డు గ్రహీత రాణిని సన్మానిస్తున్న సర్పంచ్

కార్టూ'నిజం'



ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణపై ఉద్యమించాలి



రమణారావు

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని అమలాపురం నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు కుంచే రమణారావు పిలుపునిచ్చారు. అమలాపురంలో శనివారం రమణారావు ఓ ప్రకటన విడుదల చేశారు. 2019కి ముందే మూడుసార్లు సిఎంగా ఉన్న చంద్రబాబు హయాంలో ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టకుండా వైసిపి కట్టిన మెడికల్ కాలేజీలను ప్రయివేటు పరం చేయడం ఎంతవరకు సమంజసం అని రమణారావు ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేసే నిర్ణయం వల్ల ప్రతిభ ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యాన్ని అత్యంత ఖరీదు చేసి పేద మధ్య తరగతి వర్గాలకు అందని ద్రాక్షగా మార్చేందుకే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రయివేటుపరం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ చేయడం ద్వారా సిఎం చంద్రబాబు ప్రయివేటు వర్గాలకు కొమ్ముకాస్తున్నారని విమర్శిం చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన మాజీ సిఎం వైఎస్.జగన్ దార్శనీకుడని అన్నారు. అటువంటి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.

కాజ్‌వే పై వరద నీటితో ప్రయాణికుల అవస్థ

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి కరకట్ట దిగువన అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానానికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారిలో కాజ్‌వేపై శనివారం కూడా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు, వాహనాదారులు, బాల బాలాజీ దర్శనానికి వచ్చే యాత్రికులు సైతం వరద నీటిలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాలబాలాజీ దేవస్థానం అధికారులు ఇక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని యాత్రికులు విమర్శిస్తున్నారు. స్నానఘట్టం కూడా వరద నీట పూర్తిగా మునిగింది. ఇక్కడ వరద ప్రవాహ వేగం ఎక్కువగా ఉండటంతో రక్షణఏర్పాట్లు లేక ఏ ముప్పు పొంచి ఉందో అని యాత్రికులు స్నానమాచరించడానికి అవస్థలు పడ్డారు.



అప్పనపల్లి కాజ్ వే.పై వరద నీటిలో వాహనదారుల అవస్థలు

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - మండపేట

మండపేట మండలం ఏడిద మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏడిద గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, బూరిగ రామా రావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పర్వతిన వీర్రాజు, రామిశెట్టి రాజా, పసుపర్తి నాగబాబు, బేతా వెంకటేశ్వరరావు, పదం ఆనందరావు, గొడవర్తి సత్యనారాయణ, ప్రధానో పాధ్యాయులు ముత్యాల వెంకటేశ్వరరావు ప్రసాద్, గెడా శ్రీని వాస్, బ్రహ్మయ్య, డేవిడ్ రాజ్, మేక జేజిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏడిద పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయులు సన్మానం

పామర్రు పిహెచ్‌సిలో వైద్య సేవలపై సమీక్ష

ప్రజాశక్తి - రామచంద్రపురం

పామరు పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దుర్గారావు దొర శనివారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించి, వైద్య సేవలను సమీక్షిం నిర్వహించారు. ఇటీవల వచ్చిన వార్తలు పైన ఆయన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

ఆలయ చైర్మన్ రాంబాబుకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలోని జనార్ధన స్వామి ఆలయ నూతన పాలకవర్గ అధ్యక్షునిగా బైరిశెట్టి రాంబాబు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం ఆయనను ఎన్నారై రాయుడు వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు సలాది జయప్రకాష్ నారాయణ తదితరులు సత్కరించి అభినందనలు తెలియజేశారు.

నేరాలు ఘోరాలు

కొబ్బరిచెట్టుపై నుంచి పడి వార్డు మెంబర్ మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కొబ్బరిబొండం తీసేందుకు కొబ్బరి చెట్టు ఎక్కి, కాలు జారి పడిన ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్న కొత్తలంక గ్రామ పంచాయతీ రెండో వార్డు మెంబర్ కముజు వీర వెంకట సత్యనారాయణ అలియాస్ సూరిబాబు(48) శనివారం ఉదయం ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టు ఎక్కి కొబ్బరి బొండం తీస్తుండగా, కాలుజారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శ్రీ లక్ష్మి, కుమార్తెతో పాటు అతడిపైనే ఆధారపడిన వృద్ధ తల్లిదండ్రులు సత్య నారాయణ, సత్యవతి ఉన్నారు. దీనిపై ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదుచేసి శవ పంచనామ నిమిత్తం మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేపట్టారు.

హిజ్రాలపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వినాయకుని నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా శనివారం వెలిచేరు గ్రామంలో నిర్వహించిన ఊరేగింపులో వినాయక విగ్రహ కమిటీ సభ్యులు హిజ్రాలతో అశ్లీల నృత్యాలు చేయిస్తున్నారు. ఈ సమయంలో ఎస్ఐ ఎస్.రాము దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్లీల నృత్యాలు చేస్తున్న హిజ్రాలపైనా, కమిటీ సభ్యులు పైనా కేసు నమోదు చేశారు. అలాగే వినాయక నిమజ్జనం ఊరేగింపుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా డిజె సౌండ్, అశ్లీల నృత్యాలు వంటివి పాల్పడితే కేసు నమోదు చేస్తామన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామలక్ష్మణమూర్తి తదితరులు

కళాఉత్సవ్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఈ నెల 11,12 తేదీలలో ప్రభుత్వ జిల్లా విద్య శిక్షణ సంస్థ బొమ్మూరులో ఈ నెల 11,12 తేదీల్లో నిర్వహించే కళా ఉత్సవ్-2025 కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని రామచంద్రపురం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ప్రత్తి రామలక్ష్మణ మూర్తి పిలుపునిచ్చారు. దీనికి ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తమ కార్యాలయంలో కళా ఉత్సవ్ 2025 పోస్టర్ ను శనివారం ఆవిష్కరణ చేశారు. పాల్గొన డైట్ ఫిజిక్స్ లెక్చరర్ కె.శ్రీకృష్ణసాయి మాట్లాడుతు ఈ కార్యక్రమంలో 9 వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని అన్నారు.విద్యార్థులకు గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటక కళలు వంటి అంశాలు పై పోటీలు ఉంటాయి అని శ్రీకష్ణసాయి తెలిపారు. పూర్తి వివరాలు కు డైట్ బొమ్మూరు ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠ శాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మేడిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మోడరన్ కాలేజీ విద్యార్థుల నిరసన ప్రదర్శన

కాకినాడ జిల్లాలో కలపాలని నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో కాకినాడ జిల్లాలో కలపాలని జెఎసి ఆధ్వర్యంలో శనివారం మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జెఎసి కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో- కన్వీనర్ బి.సిద్ధూ, మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ, మోడరన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, జెఎసి నాయకులు నారపురెడ్డి బలరాం తదితరులు పాల్గొన్నారు.

రామాలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని పెనికేరు ఎస్‌సి పేటలో ఉన్న రామాలయం పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆలయ అభివద్ధికి తన వంతు కషి చేస్తానని టిడిపి నాయకులు ఈదర చిన్నబాబు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన నిర్మాణ పనులను స్థానిక పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఇప్పటికే ఆయన ఆలయ నిర్మాణానికి మొదటి విరాళంగా చిన్నబాబు రూ.రెండు లక్షలు అందించి పనులు ప్రారంభించారు. ఆయన వెంట పెనికేరు సొసైటీ అధ్యక్షులు మేకా రాంబాబు, టిడిపి గ్రామ అధ్యక్షులు గొడవర్తి సూర్య భాస్కరరావు, నేతలు కోన శ్రీనివాస్, గొడవర్తి శేషుబాబు తదితరులు ఉన్నారు.

ఎరువుల కోసం తప్పని పాట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎరువులు అందక రైతులు ఆర్ఎస్‌కెల వద్ద పడిగాపులు పడుతున్నారు. మండల పరిధిలోని ఏటుపట్టు అన్ని గ్రామాల్లో, మెట్ట గ్రామాల్లో చెరువులు కింద రైతులు వరి పండిస్తున్నారు. ఈ ఏడాది యూరియా రైతులకు సకాలంలో సరఫరా కాక వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనిపై మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్‌కుమార్ మాట్లా డుతూ మండల పరిధిలో యూరియా కొరత ఉందన్నారు. యూరియా 600 టన్నుల అవసరం ఉందన్నారు. అత్యవసరంగా 200 టన్నులు అవసరం ఉందన్నారు. శనివారం రాత్రికి 50 టన్నులు, ఆది, సోమవారల్లో మరో వంద టన్నులు మండలానికి చేరుతుందన్నారు.

వరద గోదావరి..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి వరదలు నదీ పరివాహక ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలతో పాటు జిల్లాలోనూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి క్రమ క్రమంగా పెరుగుతోంది. అయితే గడిచిన పది రోజులలో తగ్గుతూ.. పెరుగుతూ దోబూచులాడింది. గడిచిన వారంలో రెండు దఫాలు మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. ఈ నేపత్యంలో తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలలోని లంక గ్రామాల్లో నివసించే ప్రజలు బిక్కు బిక్కుమంటూ జీవనం సాగించారు. మరోవైపు వారాంతంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలకు గోదావరి వద్దకు పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకోవటంతో ఇబ్బందులు తలెత్తాయి. పరివాహక ప్రాంతాల్లో పోలీసు యంత్రాగానికి పెద్ద సవాలుగా మారింది. అయితే ఎటువంటి అవాంతరాలు లేకుండా కార్యక్రమాలు ముగియటంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

ఉపాధి కూలీలకు వేతన వెతలు

ఉపాధి కూలీలు వేతన వెతలతో ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు నిలిచిపోవటమే ఈ దుస్థితికి కారణం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్న విషయం విధితమే. సంస్కరణల పేరుతో అనేక మార్పులు తీసుకొచ్చింది. రెండేళ్ల క్రితం నూతన సాఫ్ట్‌వేర్ అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ అంటూ సాకు చెప్పింది. దీనికి తోడుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నాయి. మరోవైపు ఉపాధి చట్టానికి తూట్లు పొడిచి నెలల తరబడి కూలీలకు బకాయిలు పెట్టడం పరిపాటిగా మారింది. తక్షణమే ఉపాధి బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఫీవర్ ఫియర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభించటంతో ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పల్లెలు, పట్టణాలలో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. దీంతో దోమల వృద్ధి గణనీయంగా పెరిగింది. ఫలితంగా డెంగీతో పాటు ఇతర జ్వరాల విజృంభణ ఒక్కసారిగా పెరిగింది. ఇటువంటి పరిస్థితులను అధిగమించేందుకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు నగరపాలికలు, పంచాయతీలు కలిసి రావాల్సి ఉంది. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. అదేవిధంగా పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో వసతులు, సౌకర్యాలు మెరుగుపర్చి ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉంది.

యూరియా కోసం రైతుల వెతలు

యూరియా కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నప్పటికీ అధికార యంత్రాంగ



భిన్నమైన ప్రకటనలు చేయటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారంటూ అధికార పార్టీ నేతలు చేస్తున్న వాఖ్యలు వారి చిత్తశుద్ధిని దర్పణం పడుతుంది. మరోవైపు యూరియా కొరత లేదంటూ అధికార యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా నిల్వలపై బులిటెన్ విడుదల చేస్తోంది. మరోవైపు చేపల చెరువులకు లేదా పరిశ్రమలకు తరలిపోయిందా అనే విషయమై పరిశీలన పెరిగింది. మరోవైపు నానో ఎరువులు వినియోగించాలంటూ వ్యవసాయ శాఖ అధికారులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ రకమైన ఎరువుల వినియోగంపై రైతుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించాలని రైతులు, రైతు సంఘాలు కోరుతున్నాయి.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

నిబంధనలను పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యు స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు కంటేపల్లి నరేంద్ర డిమాండ్ చేశారు. అమలాపురంలో ఒక ప్రయివేటు జూనియర్ కళాశాల లొకేషన్ కామనగరువు లో చూపిస్తూ అమలాపురం కాలేజీ రోడ్ గోకుల్ సెంటర్ వద్ద కళాశాల నిర్వహిస్తున్నారని అన్నారు. కళాశాలకు ఎటువంటి ఫైర్ నిబంధనలు అమలు చేయడం లేదని, విద్యార్థులకు సరిపడా గదులు లేకపోయినా విద్యాశాఖ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం కలెక్టరేట్ లో ఫిర్యాదు చేశారు. అలాగే ఒక ప్రయివేటు ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ అని పెట్టి సిబిఎస్‌సి సిలబస్‌కు పర్మిషన్ లేకుండా పాఠశాల ఎలా నడుపుతున్నారని, ఆ ప్రయివేటు జూనియర్ కళాశాల లో అనధికార అకాడమీ నడుపు తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 77 రద్దుచేసి పీజీ చదివే వరకు పేద విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్ అమలు చేయాలని, మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల పాల్గొన్నారు.

గొల్లపల్లి సూర్యారావుకు నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - అయినవిల్లి

సోదర వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును శనివారం వైసిపి నాయకులు రావులపాలెంలో వారి స్వగృహమందు పరామర్శించారు. అనంతరం గొల్లపల్లి భాగ్యరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్, వైసిపి నాయకుడు, పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యువజన విభాగం మాజీ జనరల్ సెక్రెటరీ చెట్ల రామారావు, మానేపల్లి గ్రామ ఉప సర్పంచ్ ఉండ్రాజవరపు దుర్గారావు, పి.గన్నవరం మండల విద్యార్థి విభాగ అధ్యక్షుడు కొండేటి సురేష్ బాబు, వైసిపి పి.గన్నవరం మండలం సోషల్ మీడియా అధ్యక్షులు ఆకుమర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యంపేటలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం గ్రామ పంచాయతీ పరిధిలో గల బియ్యంపేట ఏరియాలో కొద్ది రోజులుగా లోవోల్టేజ్ సమస్యతో ఇక్కట్లు గురవుతున్నారు. పలుమార్లు అధికారులకు దీనిపై ఫిర్యాదు చేశారు. దీపిసౌ ఎలక్ట్రికల్ ఎఇ రమణపై అధికారులతో చర్చించి 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను పిహెచ్‌సి వద్ద శనివారం ఏర్పాటుచేశారు. రమణ, లైన్‌మ్యాన్ రామకృష్ణ, ఎనర్జీ అసిస్టెంట్ బాషా, పంచాయతీ ఎలక్ట్రిషన్ భాస్కరరావు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును పర్యవేక్షించారు. బియ్యం పేట ప్రాంతంలో లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించామని ఎఇ రమణ తెలియజేశారు.

లేఖ్యకు గ్రాడ్యుయేషన్ పట్టా అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

విశాఖపట్నం దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీలో బిఎ ఎల్ఎల్‌బి ఆనర్స్ పూర్తి చేసుకున్న మండలంలోని చెముడులంకకు చెందిన చెక్కా లేఖ్య సుప్రీంకోర్టు జడ్జిల చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ పట్టాను అందుకుంది. శుక్రవారం విశాఖపట్నం లో జరిగిన ఈ వేడుకలకు హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విచ్చేసి, ఉత్తీర్ణులైన వారికి అందజేశారు. లేఖ్య స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఢిల్లీ పార్లమెంటులో లెజిస్లేటివ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్నట్లు తెలిపారు.. చెముడులంకలో శ్రీసాయి మణికంఠ మెడికల్ స్టోర్స్ యజమాని చెక్కా నాగేశ్వరరావు(నాగు), సత్య దంపతుల కుమార్తె లేఖ్యను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించాలని వినతి

ప్రజాశక్తి - అమలాపురం

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు చెల్లించి ధ్రువపత్రాలు తక్షణం అందించాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంపీ గంటి హరీష్‌నుకలిసి వినతి పత్రం అందించారు. పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు ఎంపీ హరీష్ తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయకపోవడం వలన కోర్సు పూర్తి చేసి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించకుండా రూ.2 లక్షల 25 వేల ఫీజు కడితేనే ధ్రువపత్రాలు అందిస్తామని ట్రిపుల్ ఐటీ యాజమాన్యాలు పేద విద్యార్థులను వేధించడం అన్యాయమని ఎంపీ హరీష్‌కు వివరించారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం లో ట్రిపుల్ ఐటీలో చదివి కోర్సు పూర్తి చేసిన దాదాపు 200 మంది విద్యార్థులు ఈ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ధ్రువపత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ హరీష్‌ను కోరారు. ఎంపీ హరీష్ స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి విద్యార్థుల ఇబ్బందులను తీసుకువెళ్లి ధ్రువపత్రాలు వెంటనే అందించేలా కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎ.సునీత, బి.వర్మ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాల్లో బాలలకు అనుమతి లేదు

ప్రజాశక్తి - ఆలమూరు

గణపతి నిమజ్జనాలలో బాలలకు అనుమతి లేదని ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. ఈ మేరకు శని వారం మండల పరిధిలోని కాలువ రేవులలో, పుష్కర ఘాట్ల వద్ద, జొన్నాడ బ్రిడ్జిల వద్ద పంచా యతీరాజ్, పోలీస్, రెవెన్యూ శాఖల సంయుక్తంగా ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలకేంద్రం ఆలమూరు చెందిన కాలువ రేవు వద్ద గణపతి నిమజ్జనానికి వచ్చిన పలువురు బాలలను నిలుపుదల చేసి కాలువలోకి దిగడానికి అనుమతి లేదని పెద్దలకు హెచ్చరికలు జారీ చేశారు.



అంబాజీపేటలోని ఎంఆర్‌సి కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సమాజంలో గురువుల పాత్ర ఉన్నతమైంది

ప్రజాశక్తి - అంబాజీపేట

సమాజంలో విద్యార్థులకు విజ్ఞానం అందించే సమాజ నిర్దేశకులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఉన్నతమైందని ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఎంఆర్‌సి కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు కె. వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ లు అధ్యక్షతన శనివారం జరిగిన గురుపూజోత్సవ ఎంపిపితో పాటు సర్పంచ్ నాగాబత్తుల శాంతాకుమారి, ఎంపిటిసి పద్మావతి, ఇరిగేషన్ స్టేట్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు అరిగెల సూరిబాబు, ఎఎంసి వైస్ ఛైర్మన్ కె.వెంకటేశ్వరరావు, ముఖ్య అతిథులు గా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా అవార్డు గ్రహీతలు ఎఎల్. వరప్రసాద్, సిహెచ్ శ్యామలా కుమారి, కె.గణేష్ నరసింహారావు, మండల స్థాయి అవార్డు గ్రహీతలు ఎస్.శ్రీనివాస్, కె.భూలక్ష్మి, బి.శ్రీదేవి, కె.నాగ శ్రీ దేవి, ఎ.మంగాతాయారు, పి.రాజేశ్వరీలకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యాలయంలో యూనియన్ నాయకులు, వివిద పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికి రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కాలేజీ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికి రెడ్డి, మన్యం పర్వత వర్ధన్, జివి.వెంకటరమణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.సూర్యనారాయణ రెడ్డి, కళాశాల కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికి రెడ్డి, కార్యదర్శి కొవ్వూరి నరేష్ కుమార్ రెడ్డి, కొవ్వూరు వెంకటరెడ్డి, సిఆర్‌సి ప్రెసిడెంట్ తాడి నాగ మోహన్ రెడ్డి, సత్య సాయి సేవా సంస్థ మన్యం పర్వత వర్ధన్ రావు, జక్కంపూడి రామకృష్ణ, పెచ్చేటి చిన్నారావు తదితరులుపాల్గొన్నారు.



రావులపాలెం ప్రభుత్వ జూనియన్ కళాశాలలో గురుపూజోత్సవం

జూనియర్ కళాశాలను సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎంపిడిఒ ఎ.రాజు శనివారం సందర్శించారు. అలాగే కాలేజ్ ఆవరణలో పరిశుభ్రతలో భాగంగా చెత్త, నీటి కుంటలు వంటి వాటిపై పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలేజ్ ప్రహరీ నిర్మాణానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారన్నారు. వాటి అభివృద్ధి పనులను, కళాశాల ఆవరణలను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. అలాగే ప్రిన్సిపల్ సురేష్ రెడ్డికి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆయన్ని అభినందించారు. కార్యక్రమంలో నేతలు సలాది నాగేశ్వరరావు, గారపాటి త్రిమూర్తులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నో బ్యాగ్ డేతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నో బ్యాగ్ డే తో విద్యార్థులు మానసిక ఉల్లాసం పెరుగుతుందని పాఠశాల హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ అన్నారు. శనివారం కపిలేశ్వరపురం మండలంలోని వల్లూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన నో బ్యాగ్ డే తో విద్యార్థులు సందడి నెలకొంది. ఈ కార్యక్రమం వల్ల ప్రతి శనివారం విద్యార్థులు ఆనందంగా గడుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన



ఆలమూరు ఎంపిడిఒకు వినతి అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



మామిడికుదురు ఎంపిడిఒ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర జెఎసి సచివాలయ ఉద్యోగుల పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ నిర్ణయాలపై గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ఎంపిడిఒ కార్యాలయాల్లో ఎంపిడిఒలకు వినతిపత్రాలు అందజేశారు.

ఆలమూరు: రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు అందరూ ప్రభుత్వం తీసుకుంటున్న అస్తవ్యస్త నిర్ణయాలను, అనవసర యాప్ లను తొలగించాలని కోరుతూ తమ నిరసన తెలియ జేశారు. అందులో భాగంగా సచివాలయ ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం విరామ సమయంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ ఎ.రాజుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే తొలుత ఆయా గ్రామ సచివాలయాల వద్ద తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ రూపొందించిన పత్రంపై ఉద్యోగులందరూ సంతకాలు చేసి గ్రామ కార్యదర్శులకు అందజేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల వ్యతిరేక వైఖరిని ప్రభుత్వం విడనాడకుంటే భవిష్యత్ నిరసన కార్యక్రమాన్ని ప్రకటిస్తామని వారు హెచ్చరించారు. **మామిడికుదురు**: తమ ఆత్మగౌరవానికి భంగం కలిగించే వాలంటీర్ విధులను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు తెలిపారు రాష్ట్ర జెఎసి సచివాలయ ఉద్యోగుల పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై శనివారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మామిడికుదురు ఎంపిడిఒ భవానికి అందజేశారు. ప్రభుత్వం తమ ఆత్మగౌరవాన్ని దిగజార్చే నిర్ణ యాలు తీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు గతంలో వాలంటీర్ క్లస్టర్ కు పరిమితం కాగా ప్రస్తు తం సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు మ్యాప్ చేసి బలవంతంగా ఇంటింటికి తిరిగే విధులు అప్పగిస్తున్న తీరుపై నిరసన తెలుపుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు వాలంటీర్ విధులు ఆపాలని డిమాండ్ చేశారు. **అంబాజీపేట:** మనమిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ లో భాగంగా కుటుంబ సభ్యుల సర్వేలో విధించిన క్లస్టర్ వైజ్ టార్గెట్లతో సచివాలయ ఉద్యోగులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర జెఎసి సచివాలయ ఉద్యోగులు పిలుపు మేరకు సర్వేలకు తగినంత సమయం కేటాయించాలని కోరుతూ శనివారం అంబాజీపేట మండల సచివాలయ ఉద్యోగులు ఎంపిడిఒ ఎపిఎల్. నరసింహంకు వినతిపత్రం సమర్పించారు. ప్రతి ఉద్యోగికి కి నెలకు 200 నుంచి 250 కుటుంబాల సర్వే టార్గెట్ నిర్దేశిస్తున్నారని, నెలకు నాలుగు-ఐదు సార్లు వేర్వేరు సర్వేల కోసం ప్రజల వద్దకు వెళ్లి ఓటీపీలు సేకరించడంలో ప్రజలు సహకరించడం లేదని ఉద్యోగులు తెలిపారు. కొన్ని సందర్భాల్లో సర్వేల విషయంలో ప్రజలు చులకనగా మాట్లాడటం వల్ల ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలుగు తోందన్నారు. ప్రజలు ఇంటి దగ్గర లేకపోవడంతో కొన్నిసార్లు సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు వేచి ఉండవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల మహిళా ఉద్యోగులు చాలా ఇబ్బందు లకు గురవుతున్నారని తెలిపారు. గతంలో సర్వేలు, పెన్షన్ పంపిణీ పనుల కోసం వాలంటీర్లకు 50 కుటుంబాలు మాత్రమే కేటాయించే వారని. ప్రస్తుత విధానం ఎక్కువ భారాన్ని కలిగిస్తోందని, రోజువారీ విధుల నిర్వహణకు ఆటంకం కలుగుతోందన్నారు. పని భారాన్ని తగ్గించే దిశగా ఆదేశాలు జారీ చేయాలని ఉద్యోగులు వినతి పత్రం ద్వారా కోరారు. మండలంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **రావులపాలెం:** ప్రభుత్వం తీసుకొంటున్న అస్తవ్యస్త నిర్ణయాలు మార్చుకోవాలని సచివాలయం సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం రావులపాలెం లో ప్రభుత్వం సచివాలయం ఉద్యోగుల విధుల్లో వ్యవహరిస్తున్న అస్తవ్యస్త నిర్ణయాలపై నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు చేశారు. మధ్యాహ్న భోజనం విరామ సమయంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మండల పరిషత్ ఎఒ కె.మంగతాయారుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. తొలుత ఆయా గ్రామ సచివాలయాల వద్ద తాము ఎదుర్కొంటున్న అవస్థలను వివరిస్తూ రూపొందించిన పత్రంపై ఉద్యోగులంతా సంతకాలు చేసి సంబంధిత పంచాయతీ గ్రామ కార్యదర్శులకు అందజేశారు. ప్రభుత్వం వైఖరిని మార్చుకోకపోతే భవిష్యత్ నిరసన కార్యక్రమాన్ని ప్రకటిస్తామని వారు హెచ్చరించారు.



అంబాజీపేట ఎంపిడిఒకు ఇబ్బందులు తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు



రావులపాలెం మండల పరిషత్‌కార్యాయలం ఎఒకు వినతిపత్రం